క్లుప్తంగా

అభినందనీయం

దేవరుప్పుల: పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ఉపాధ్యాయురాలు టి.నిహారిక ఉదారత్వం అభినందనీయమని హెచ్ఎం శ్రీలత అన్నారు. శనివారం మండలంలోని కామారెడ్డిగూడెం హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు ఆశ ఫౌండేషన్ ప్రతినిధి నాదేళ్ల విజయ సహకారంతో పరీక్షలకు సంబంధించి పలు ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తేవాలనే సంకల్పంతో బాలికల పరిరక్షణ కోసం ఉపకరణాలు, విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు, పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనలో తోడ్పాటును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలతో పార్టీ బలోపేతం

దేవరుప్పుల: ఆత్మీయ సమ్మేళనాలతో బీఆర్ఎస్ పార్టీ బలోపేతం అవుతుందని బీఆర్ఎస్ పలు గ్రామాల ఇన్‌చార్జ్ పల్ల సుందర్‌రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని చిన్న మడూరు, గొల్లపల్లి, కామారెడ్డిగూడెం తదితర గ్రామాల్లో ఆయన సన్నాహక సమావేశాలు నిర్వహించి పార్టీ దిశ, నిర్దేశకత్వంపై అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు వంగ పద్మ, కోనేటి సుభాషిణి, బిల్లా అంజమ్మ, ఎంపీటీసీ పోరం మండల అధ్యక్షురాలు గొడుగు సుజాత మల్లిఖార్జున్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ నుంచి సీతారాముల ఉత్సవ విగ్రహాలతో శ్రీసీతారామచంద్రస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. మల్కాపూర్ నుంచి మొదలైన ఈయాత్ర వెంకటాద్రిపేట, వెంకటేశ్వరపల్లె, చిల్పూరు, చిల్పూరుగుట్ట, తీగలతండా, రాజవరం, చిన్నపెండ్యాల, దేశాయితండా, పల్లగుట్ట మీదుగా మల్కాపూర్ గ్రామానికి తీసుకవెళ్లారు.

ఫిర్యాదు

జనగామ రూరల్: మండలంలోని అడవికేశాపూర్ గ్రామానికి చెందిన రైతులు బానోత్ రాంకోటి, బత్తిని శివనారాయణ, పోలేపాక పోషయ్యలకు చెందిన మోటార్లు దొంగిలించారని శనివారం జనగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతులు తమ వ్యవసాయం కోసం గ్రామ శివారు నర్మెట మండలం బమ్మకూర్ రిజర్వాయర్‌లో మోటార్ల ద్వారా నీటిని తరలించి సాగుచేసుకుంటున్నామని, అప్పులు తెచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటుంటే మోటార్లు ఎత్తికెళ్లడం వల్ల ఇబ్బందుల పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్క మోటార్ రూ.20 వేల విలువ ఉంటుందని, తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నెల్లుట్ల సర్పంచ్ భర్తపై..

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల సర్పంచ్ చిట్ల స్వరూపరాణి భర్త చిట్ల భూపాల్ రెడ్డిపై శనివారం రాత్రి ఎంపీపీ చిట్ల జయశ్రీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఉదయం గ్రామంలో రెడ్‌కో సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వీధిలైట్ల బిగింపు కార్యక్రమానికి ఆ సంస్థ ఆహ్వానం మేరకు వెళ్లగా ఇష్టమొచ్చినట్లు బూతులు తిడుతూ జీపీలో ఏం పని నీకు ఎంపీపీగా మండలంలో చూసుకో నీ అంతు చూస్తానని బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళ అని కనీస మర్యాద కూడ ఇవ్వకుండా దూషించినట్లు, గతంలో కూడా ఇదే విధంగా దూషించిన తీరుపై కూడా ఫిర్యాదు చేశామని వివరించారు. ఇదిలా ఉండగా గత మూడు నెలల క్రితం గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశంలో సర్పంచ్ స్వరూపరాణి, ఎంపీపీ జయశ్రీ ఒకరినొకరు దూషించుకొని ఇరువురు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా కేసులు నమోదయ్యాయి.

ముగ్గురి అరెస్ట్

పాలకుర్తిటౌన్: మండలంలోని దర్దేపల్లిలో బైక్ దహనం చేసిన ఘటనలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ వివరాలను వెల్లడించారు. దర్దేపల్లికి చెందిన గణపురం రంజిత్‌కుమార్‌కు అదే గ్రామానికి చెందిన దుంపల నరేష్‌లకు మధ్య భూ వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ భూ తగాదాల వ్యవహారంలో స్థానికుడు తాడెం రవి తలదూర్చి ప్రత్యర్థి నరేష్‌కు సహకరిస్తున్నాడనే అనుమానంతో రంజిత్ కక్ష పెంచుకున్నాడు. రంజిత్‌కుమార్ తండ్రి నర్సయ్య ప్రోద్బలం మేరకు గ్రామానికి చెందిన బన్నీ సహకారంతో శుక్రవారం రాత్రి తాడెం రవి ఇంట్లో నిలిపిన ద్విచక్ర వాహనాన్ని దొంగిలించి స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పెట్రోల్ పోసి దహనం చేశారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు నింధితులను అదుపులోకి తీసుకున్నారు. నింధితులను కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ తెలిపారు.

చెక్కు అందజేత

కొడకండ్ల: నిరుపేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసాగా నిలుస్తుందని బీఆర్ఎస్ గ్రామ ఇన్‌చార్జ్ కాటూరి కృష్ణమూర్తి, అధ్యక్షుడు మేకల రమేష్‌యాదవ్ అన్నారు. శనివారం రామన్నగూడెం గ్రామానికి చెందిన ఏల్పుగొండ సురేష్‌కు మంజూరైన రూ.30 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్దిదారుడికి అందజేశారు. సర్పంచ్ లింగయ్య తదితరులు ఉన్నారు.

ప్రాణం పోసే దేవుళ్లు..

- ఆపత్కాలంలో అండగా 108 అంబులెన్స్‌లు
- రాత్రి, పగలు డ్యూటీలోనే సిబ్బంది
- నేడు అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుల దినోత్సవం

జనగామ: ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా టక్కున గుర్తుకు వచ్చేది 108 అంబులెన్స్. ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించడంలో ఆసల్యం కావడంతో అనేక మంది చనిపోయారు. దీంతో చలించిపోయిన అప్పటి ముఖ్యమంత్రి దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి 2005 సంవత్సరంలో 108 అంబులన్స్‌ల సదుపాయానికి శ్రీకారం చుట్టారు. ఆ వాహనాలు సంజీవనిలా ఊపిరి పోస్తున్నాయి. నేడు అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో 16 సంవత్సరాల నుంచి 108 అంబులెన్స్ సేవలు కొనసాగుతున్నాయి. ఆయా మండలాల పరిధిలో 7 వాహనాలు షిఫ్టుల వారీగా 24 గంటల పాటు సేవలిందిస్తున్నాయి. ఒక్కో అంబులెన్స్‌లో నలుగురు సిబ్బంది పని చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలతో పాటు కడపునొప్పి, గర్భిణులు, అత్యవసర సమయంలో ప్రసూతి, ఆత్మహత్యాయత్నాలు, అల్లర్లలో గాయపడ్డ క్షతగాత్రులు ఇలా ఆపత్కాలంలో మేమున్నామంటూ 108 అంబులెన్స్ వాహనాలు భరోసా కల్పిస్తున్నాయి. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో జనగామ 108 అంబులెన్స్‌లు బాధితులను హైదరాబాద్, హనుమకొండ, ఇతర ప్రాంతాలకు తీసుకు వెళ్లడంలో సిబ్బంది తమ ప్రాణాలు సైతం ఫణంగా పెట్టారు. శుభకార్యాలు, పండగలు, ఇంట్లో అత్యవసర పనులు సైతం వదులకుని.. చాలీచాలని వేతనాలతో ప్రజల కోసం సేవలందిస్తున్నారు.

ఏడాదిలో 9,084 కేసులు

జిల్లాలో 2022 మార్చి 31 నుంచి 2023 మార్చి 31 వరకు జిల్లాలోని 108 అంబులన్స్ వాహనాల ద్వారా 9,084 కేసులను టేకప్ చేశారు. ఇందులో కేటగిరీల వారిగా.. మెడికల్ 4,400, రోడ్డు, రైలు ప్రమాదాలు 1,080, ఆత్మహత్యలు 421, డెలివరీలు 3,144, అంబులెన్స్‌లో డెలివరీలు 39 ఉన్నాయి.



అంబులెన్స్‌లో ప్రసూతి (ఫైల్)

కష్టాలను ఎదుర్కొంటూనే..



జనగామ 108 అంబులెన్స్‌ల్లో 16 మంది పని చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించే క్రమంలో ఏకాగ్రత అవసరం. ఒక్కోసారి రెండు గంటల సమయం సైతం పడుతుంది. అయినా.. అక్కడే ఉండి వారికి ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ.. ఆస్పత్రికి తీసుకు వచ్చేలా చూస్తాం. ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ పని చేస్తున్న ఈఎంటీలకు శుభాకాంక్షలు.

- శ్రీనివాస్, 108 కోఆర్డినేటర్, జనగామ

80 డెలివరీలు చేశాం



108 అంబులెన్స్‌లు మొదలైనప్పటి నుంచి పని చేస్తున్నాను. ఇప్పటి వరకు సహచరులతో కలిసి 80 డెలివరీలు వాహనాల్లోనే చేశాం. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవ చేయడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాను. కరోనా సమయంలో కుటుంబ సభ్యులకు నచ్చచెబుతూ నిత్యం విధుల్లో ఉన్నాం.

- మామిడి రాకేష్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్

సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా..



108 అంబులెన్స్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. 16 ఏళ్లుగా ఇందులోనే పనిచేస్తున్నాను. ఆపదలో ఉన్నది ఎవరైనా సొంత వాళ్లుగా భావిరచి కేర్ తీసుకుంటాను.

- కె.భాస్కర్, మెడికల్ టెక్నీషియన్

బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం



కార్యాలయ ప్రారంభోత్సవంలో నాయకులు

నర్మెట: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్‌తోనే దేశంలోని అన్నివార్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎంపీపీ తేజావత్ గోవర్దన్, రాష్ట్ర నాయకుడు గద్దల నర్సింగా రావు, ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి అన్నారు. మండలంలోని హన్మంతాపూర్‌లో శనివారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ఆవిర్భావాన్ని జీర్ణించుకోలేని కేంద్రం ఈడీని అడ్డం పెట్టుకుని తప్పుడు కేసులతో అప్రజాస్వామిక పాలన చేస్తోందన్నారు. జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, జెడ్పీకోఆప్షన్ ఎండి గౌస్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్, సర్పంచ్‌లు పగడాల విజయ నర్సయ్య, శంకర్‌నాయక్, రజితా రవి, వైస్ ఎంపీపి మంకెన ఆగిరెడ్డి, ఎంపీటీసీలు చైతన్యా హెప్సేబర్, లలితా సోమ్లా, అంజయ్య, మల్లేష్, కిషన్, నక్కల రవి, పిట్టల రాజు, రెడ్డబోయిన రాజు పాల్గొన్నారు.

పరీక్ష సమయంలో ఆందోళనకు గురికావొద్దు



స్టేషనరీ, హ్యాండ్ బ్యాగులను అందజేస్తున్న సాదిక్ అలీ

లింగాలఘణపురం: విద్యార్థులు పరీక్ష సమయంలో ఆందోళనకు గురి కావద్దని సాదిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సాదిక్ అలీ సూచించారు. శనివారం మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సాదిక్ ఫౌండేషన్ స్టేషనరీ, హాండ్ బ్యాగులు అందించారు. కవి హృదయం సాహిత్య వేదిక జనగామ అధ్యక్షుడు పెట్లోజు సోమేశ్వరాచారి మాట్లాడుతూ పుస్తకాలను ప్రేమించి జీవన నైపుణ్యాలను పెంచుకోవాలని కోరారు. సర్పంచ్ విజయ, టీయూటీఎఫ్ మండల అధ్యక్షుడు భాస్కర్, స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ, ఎలిజబెత్‌రాణి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం

జనగామ రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అముతుల్ అలియా అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాస్పియన్ ఫౌండేషన్ ప్రతినిధి తొటం నిహారిక పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థినులకు నాప్కిన్లు పంపిణీ చేశారు.

వాటర్ ప్యూరిఫయర్, టేబుళ్ల వితరణ..

పట్టణంలోని శెట్టి పుల్లయ్య జ్ఞాపకార్థం రాజరాజేశ్వరీ వృద్ధాశ్రమంలో కుమారుడు వెంకన్న వాటర్ ప్యూరిఫయర్, టెబుల్స్ వితరణ చేశారు. జిల్లా సంక్షేమాధికారి జయంతి, మున్సిపల్ చైర్మన్ పోకల జమున, తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి

జనగామ రూరల్: టీఎస్‌పీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో జరిగిన పేపర్ లీకేజీపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దడిగే సందీప్ అధ్యక్షత ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేపర్ లీకేజీ జరిగి చాలా రోజులు అవుతున్నా సీఎం కేసీఆర్ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే స్పందించి నిరుద్యోగులకు భరోసా కల్పించాలని అన్నారు. ఈనెల 7వ తేదీన నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం, నాయకులు లవకుమార్, వంశీ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

అభినందనలు



లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల పంచాయతీకి రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీ పురస్కారం రావడంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి సర్పంచ్ చిట్ల స్వరూపరాణిభూపాల్‌రెడ్డి, జీపీ కార్యదర్శి శ్రీనివాసురెడ్డితో కలిసి గ్రామంలో భారీగా ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ పూలమాల వేసి ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం గ్రామస్తులతో భారీ ర్యాలీతో పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లారు.

చేయూత

బచ్చన్నపేట: కొన్నెలో ఇటీవల వేపచెట్టు కనుకయ్య మృతి చెందాడు. కాగా, తోటి పదోతరగతి బ్యాచ్ స్నేహితులు బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్, భాస్కర్, ధనంజయ్, నర్సింహులు, కిష్టయ్య, రవి, పోచయ్య పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం



బచ్చన్నపేట: పోచన్నపేటలోని పెద్ద వాగుపై నిర్మించిన చెక్ డ్యాం పనుల శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయమై శనివారం గ్రామ బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు శిలాఫలకం ధ్వంసం చేసిన వారిని గుర్తించి శిక్షించాలని కోరారు. గూడ సిద్దారెడ్డి, మహేందర్‌రెడ్డి, కిష్టయ్య, ఫిరోజ్, నర్సింహులు, నవీన్ కోరారు.

నివాళి

రఘునాథపల్లి: మండలకేంద్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు రామగుండం మల్లయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య శనివారం సంఘం నాయకులతో కలిసి రఘునాథపల్లికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. మృతుడి కుంటుబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి, అంజయ్య, యాకయ్య, కృష్ణ, శ్రీనివాస్, మురళి, రాములు తదితరులు ఉన్నారు.

ఎన్నిక

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లులో భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పొన్న సాయిలు, ఉపాధ్యక్షుడిగా అన్నెపు సమ్మయ్య, కార్యదర్శిగా చేపూరి సురేష్, సహాయ కార్యదర్శిగా మడికంటి వెంకటేష్, కోశాధికారిగా భాస్కుల దయాకర్, కార్యవర్గ సభ్యులుగా అన్నెపు ప్రవీన్, బూర్ల సాయి, యాట పెద్ద యాదగిరి, అశోక్, నాగరాజు, శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

పరీక్ష ప్యాడ్ల అందజేత



కొడకండ్ల: మండలకేంద్రంలోని టీఎస్ఆర్ఎస్ బాలికల రెసిడెన్షియల్‌లోని 80మంది పదో తరగతి బాలికలకు ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్, స్కేల్స్‌ను శనివారం పంపిణీ చేశారు. మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవిందర్ స్ఫూర్తితో ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ అందించిన పరీక్ష సామగ్రిని ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్ ద్వారా అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు పెద్దపూడి ప్రసన్నకుమార్, హెచ్ఎం సునెప్ జమీర్, వలంటీర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

చిల్పూరు: మండలంలోని రాజవరంలో శనివారం 3వ వార్డులో సీసీ రోడ్డు పనులను బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు యాకూబ్, రంగు రవి, వెంకటస్వామి, కొంరయ్య, కన్నెబోయిన రాములు, బైరగోని మల్లయ్య పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట ధర్నా

జనగామ రూరల్: పట్టాలు ఉన్న లబ్ధిదారులకు కాకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇళ్లు ఇస్తే ఊరుకునేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శనివారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ 2012–13లో పట్టణంలో 1,144 మందికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఇచ్చారని అన్నారు. పట్టాలిచ్చిన వారికి కాకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నవారికి ఇచ్చేందుకు సర్వేలు చేపట్టడం సరికాదన్నారు. పట్టాలు ఉన్న అందరికీ ఇవ్వాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అహల్య, యదగిరి, శేఖర్, ప్రకాష్, విజేందర్, చందు, గౌసియా, వరలక్ష్మి, రజిత, మైసమ్మ, ఆండాలు, భూ లక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్ హయాంలోనే రాష్ట్రం సుభిక్షం



బచ్చన్నపేట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని వైఎస్సాఆర్ టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం సాల్వాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ నుంచి 30 మంది వైఎస్సార్ టీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్ టీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తామని తెలిపారు. మండల అధ్యక్షుడు శ్రీకాంత్, రాజు, నర్సింహులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత ఉత్సవాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ రెండు రోజుల పాటు నిర్వహించే దుర్గామాత ఉత్సవాలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు ముందుగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి పోశమ్మ, పెద్దమ్మ తల్లికి బోనాలు చేశారు. అర్ధరాత్రి దాటాక ఊరుమ్మడిగా డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా బయలుదేరారు. గ్రామ కూడలిలోని బొడ్రాయి వద్దకు చేరుకొని అక్కడి నుంచి శివసత్తుల పూనకాలతో దుర్గామాత ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. సర్పంచ్ దొరగొల్ల ఐలమ్మ, పండుగ ఉప్పలయ్య, దొరగొల్ల యాదగిరి, పుల్ల అబ్బయ్య, పండుగ ఉప్పలయ్య, నూనె మల్లేష్, చింత యాదగిరి, పయ్యావుల కిష్టయ్య, బర్ల బాలరాజు, కాసర్ల లక్ష్మయ్య, గ్యార ఐలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

నగదు బదిలీ చేపట్టాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

చిల్పూరు: గొర్రెలకు బదులు నగదు బదిలీ చేపట్టాలని జీఎంపీఎస్ చిల్పూరు మండల అధ్యక్షుడు బుయ్య శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం జీఎంపీఎస్ సొసైటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శేఖర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వడగళ్లతో మృతి చెందిన గొర్రెలు, మేకలకు నష్ట పరిహారం అందివ్వాలని కోరారు. అవుల ప్రభాకర్, రాజారాం, రాజకొంరయ్య, భిక్షపతి, రాజయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: గొర్రెల పంపిణీలో భాగంగా ప్రభుత్వం నగదు బదిలీ చేపట్టాలని జీఎంపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎక్కలరాజు బీరయ్య కోరారు. శనివారం మండలం కేంద్రంలో మండల అధ్యక్షుడు కత్తుల రాజు ఆధ్వర్యంలో సొసైటీ సమావేశం నిర్వహించారు. జి.రాజు, ఎస్.మల్లేష్, జి.రవి, కుమార్, సుమన్, మల్లయ్య, నాగరాజు, అశోక్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి: ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో మహిళల పాత్ర కీలకమని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. కంచనపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ నవభారతి ఎంఏఎస్ సహకారంతో ప్రపంచ మహిళా మాస దినోత్సవ ముగింపులో భాగంగా నిర్వహించిన సంఘం సభ్యులలో ఆర్థిక మార్పులు (నాడు–నేడు) కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం సాగిన తెలంగాణ ఉద్యమంలో మహిళలు కోలాటాలు, బతుకమ్మలతో ముందున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడగానే సీఎం కేసీఆర్ మహిళా ఆర్థిక సాధికారత కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు.

పోషకాహారంపై శ్రద్ధ పెట్టాలి



టోల్ ఫ్రీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న గద్దల పద్మ

జనగామ రూరల్: విద్యార్థులు పోషకాహారంపై శ్రద్ధ పెట్టాలని మహిళ కమిషన్ సభ్యురాలు జి.పద్మ అన్నారు. శనివారం చౌడారంలోని కేజీబీవీని సందర్శించిన ఆమె.. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థినులు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని, చిరుధాన్యాలతో అనేక ఆరోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చని చెప్పారు. అనంతరం సఖీ సెంటర్ ద్వారా కల్పిస్తున్న సేవలను వివరించారు. సమస్యలు ఉంటే 181, 1098, 100, 9490555533 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ విక్టోరియా, సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ రేణుక, సర్పంచ్ రాజయ్య, ప్రత్యేక అధికారి రాణి తదిరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: సమతుల్యమైన పోషకాలు ఉన్న చిరుధాన్యాలను ప్రతీ ఒక్కరూ వినియోగించాలని, దాంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ ఫ్లోరెన్స్, ఘన్‌పూర్ సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్ అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా డివిజన్ కేంద్రంలోని నాల్గో, ఐదో, ఆరో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమానికి సీడీపీఓ, సర్పంచ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు, మునిగాల రాణి, మునిగాల ప్రభ, స్వరూప పాల్గొన్నారు.

బచ్చన్నపేట: చిరుధాన్యాల్లో పోషకాలు అధికంగా లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. శనివారం మండలంలోని పోచన్నపేటలో పోషణ మాసం దినోత్సవం సందర్భంగా గ్రామ జీపీలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, వెంకటేష్, వసుమతి పాల్గొన్నారు.

వెల్‌బేబీ షో

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగులలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ–2లో వెల్‌బేబీ షో నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం సుగుణ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు తోడ్పాటు

దేవరుప్పుల: బాలికల నుంచి పుట్టిన శిశువు వరకూ అంగన్‌వాడీ వ్యవస్థతో సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ తోడ్పాటు అభినందనీయమని వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలను పురస్కరించుకొని మిల్లెట్స్, వెల్‌బేబీషో, ఫుడ్ ఎగ్జిబిషన్ నిర్వహించి మహిళలకు అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, సునీత, ఎంపీటీసీ మేడ కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉన్నారు.

అమృత ఎస్టేట్‌కు నోటీసులు జారీ

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట గ్రామ శివారులోని అమృత ఎస్టేట్‌కు గ్రామ పంచాయతీ నుంచి నోటీలు జారీ చేసినట్లు జీపీ కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అమృత ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ పేర పోచన్నపేట శివారులో భూములు కొనుగోలు చేసి డీటీసీపీ అనుమతులు లేకుండా లేఅవుట్ చేసి అక్రమంగా ప్లాట్లు విక్రయం చేస్తున్నందున ఈ నోటీసులు మార్చి 29న ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ భూమి ఎన్ని ఎకరాల్లో నాలా కన్వర్షన్ చేశారు, ఎన్ని ఎకరాల్లో లేఅవుట్ చేశారో తెలుపాలన్నారు. అదే విధంగా ఎల్‌పీ నెంబర్, విస్తీర్ణం, సెక్యూరిటీ డిపాజిట్ చేసిన ఛలనా, 10 శాతం గిఫ్ట్ డీడ్ చేసిన భూమి వివరాలు, దాని మ్యాప్ తదితర పూర్తి వివరాలు మూడు రోజుల్లో అందించాలని ఎస్టేట్‌లో పని చేస్తున్న సిద్దులుకు నోటీసులను అందించామన్నారు. ఇట్టి నోటీసులను సదరు యజమానికి అందించాలని చెప్పినట్లు ఆయన వెల్లడించారు. నోటీసులు ముట్టిన మూడు రోజుల్లో సరైన వివరణతో పాటు అప్రూవల్ డాక్యుమెంట్లు అందించని పక్షంలో పీపీఆర్ చట్టం 2018 ప్రకారం ఇది అక్రమ లేఅవుట్‌గా పరిగణించి నూతన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వైద్యశిబిరాలు పేదలకు వరం



చిల్పూరు: గ్రామాల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వరం లాంటివని సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం సెనెర్జియా గ్రూప్ చైర్మన్ జీడీ జాన్ ఆధ్వర్యంలో మెడికేర్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్, ఆస్పత్రి డైరెక్టర్ చిన్నప్పరెడ్డి, మల్కాపూర్ విచారణ గురువు దాసయ్య, కోఆర్డినేటర్ కొయ్యడ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోని పేదలకు నాణ్యమైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న సమయంలో సెనెర్జియా గ్రూపు చైర్మన్ జాన్ వైద్యం అందించాలనే సంకల్పంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. డాక్టర్లు తిరుమల రావు, రాజారావు, రవీందర్, రమ్య, ఉప సర్పంచ్ మహేందర్ పాల్గొన్నారు.